క్లుప్తంగా

వేంకటేశ్వరుని సన్నిధిలో ఎమ్మెల్యే


ఎమ్మెల్యేను ఆశీర్వదిస్తున్న పూజారులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి కమ్మగూడలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో సోమవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పండితులు ఆయనకు తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సునీల్, కొత్తకుర్మ మంగమ్మ, నాయకులు.. శివకుమార్, గోపాల్, భక్తులు పాల్గొన్నారు.

బీఎల్‌ఏ శిక్షణ సమావేశం వాయిదా

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో మంగళవారం నిర్వహించతలపెట్టిన అచ్చంపేట, కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్‌ల(బీఎల్ఏ) శిక్షణ సమావేశం వాయిదా వేసినట్లు పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశం నిర్వహణ వివరాలు త్వరలో తెలియజేస్తామని ఆయన తెలిపారు.

ముగిసిన తిరుకల్యాణ ఉత్సవాలు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనగర్ (ఈసీటీ) ఆదిలక్ష్మి అలివేలు మంగా సమేత బాలాజీ వేంకటేశ్వర స్వామి తిరుకల్యాణ మహోత్సవాలు సోమవారం ముగిశాయి. చివరి రోజున స్వామివారు గుట్ట మీది నుంచి మంఖాల్ ఆలయానికి చేర్చారు. ఈ కల్యాణోత్సవాల్లో భాగంగా నాలుగు రోజుల పాటు, మంఖాల్ నుంచి స్వామివారిని గుట్టపై తీసుకురావడం కల్యాణం, ఎదుర్కొలు, రథోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలను విజయవంతం చేసినందుకు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్ భక్తులకు, పోలీసు, మున్సిపల్ సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ వంశపార్య ధర్మకర్తలు శేషం జగన్నాథచార్యులు, సింహచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా రాజు


నియామకపత్రం అందుకుంటున్న రాజు

తుక్కుగూడ: తుక్కుగూడ మున్సిపాలిటీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్ గ్రామానికి చెందిన కప్పల రాజును నియమిస్తూ సోమవారం జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బెర్రీ రాజ్‌కుమార్ నియామక ప్రతం అందజేశారు. రాజు మాట్లాడుతూ.. తన నియామకం కోసం సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

నాగోలు: డివిజన్ పరిధిలోని బండ్లగూడలోని శ్రీ కంఠమహేశ్వర శివపంచాయతన వన మైసమ్మ దేవాలయం ప్రథమ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బండ్లగూడ గ్రామస్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ పూజ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త పాల్గొని అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షుడు చెరుకు జంగయ్య గౌడ్, మెట్టు శంకరయ్య గౌడ్, ఉపాధ్యక్షుడు రుద్రగోని పాండు గౌడ్, లక్ష్మీబాయి గౌడ్, సుర్వీ ప్రమీల గౌడ్, చెరుకు బాలయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

మలక్‌పేట: అక్రమంగా మద్యం అమ్ముతున్న ఓ వ్యక్తిని మలక్‌పేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 13.3 లీటర్ల మద్యం, నగదు, సెల్ స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై నవీన్ తెలిపిన వివరాలు.. యాదయ్య(50) అనే వ్యక్తి అక్బర్‌బాగ్ డివిజన్ ప్రొఫెసర్స్ కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. హోలీ పండుగ సందర్భంగా వైన్స్‌షాప్‌లు బంద్ పెట్టిన కారణంగా ముందుగా మద్యం కొని పెట్టుకున్నాడు. సోమవారం ఎక్కువ ధరకు మద్యం విక్రయిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని సోదాలు నిర్వహించగా అతని వద్ద 13.3 లీటర్ల మద్యం (మెన్షన్ హౌజ్, ఐబీ, ఎంసీ, ఓసీ క్వాటర్ సీసాలు)దొరికింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. బెల్టు షాపులపై, నిర్వాహకులపై ఉక్కుపాదంపై మోపుతామన్నారు.

ఉత్సాహంగా రంగుల పండుగ

హోలీ పండుగను ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల పరిధిలో సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. చిన్నాపెద్దా తేడాలేకుండా ఒకరికొకరు రంగులు పూసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. మార్కెట్లో వివిధ రకాల రంగులు అందుబాటులో ఉన్నప్పటికీ పర్యావరణ సహిత రంగులు వాడేందుకే ప్రజలు ఇష్టపడ్డారు. స్థానిక ప్రజాప్రతినిధులు వేడుకల్లో పాల్గొని ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. హోలీ లాగే ప్రతి ఒక్కరి జీవితం రంగులమయం కావాలని ఆకాంక్షించారు.

– సాక్షి నెట్‌వర్క్


ఆమనగల్లు: హోలీ వేడుకలో స్థానికులు


అబ్దుల్లాపూర్‌మెట్: తారామతిపేటలో హోలీ వేడుకలు


కడ్తాల్: హోలీ వేడుకలో యువత


యాచారం: సంబురాల్లో స్థానికులు


మంచాల: హోలీ సంబురాల్లో ఆరుట్ల గ్రామస్తులు


ఆమనగల్లులోని శ్రీకర యోగా కేంద్రంలో..


ఇబ్రహీంపట్నంలో కాముడి దహనం


ఇబ్రహీంపట్నం: హోలీ సంబురాల్లో యువత


తుర్కయంజాల్: సాయినాథ్ కాలనీలో..


మాడ్గుల: హోలీ వేడుకలో

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు


గోపాలస్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు


ధ్వజారోహణానికి పూజలు చేస్తున్న పండితులు

తలకొండపల్లి: మండల పరిధిలోని చుక్కాపూర్‌లో కల్కిదోనగుట్ట గోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఫౌండరీ, ట్రస్టు చైర్మన్ సిద్ధాంతి పట్టాభిరామశర్మ, కార్యవర్గ ముఖ్య సభ్యులు కృష్ణమూర్తి శర్మ, నితిన్‌శర్మ, రాము, వ్యాపారవేత్త శ్యాంసుందర్, మల్లయ్య పాల్గొన్నారు.

దేవుని పడకల్‌లో..

మండల పరిధిలోని దేవుని పడకల్ శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఆలయంలో వేద పండితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ లట్టుపల్లి రాజ్‌కుమార్‌రెడ్డి ఆలయంలో పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈఓ స్నేహలత, క్లర్క్ ఆంజనేయులు, ఆలయ చైర్మన్ రాజ్‌కుమార్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీశైలం, మాజీ ఉప సర్పంచ్ తిరుపతి, కృష్ణగౌడ్, రంజిత్‌రెడ్డి, వేద పండితులు పద్మనాభచార్యులు, రామాచారి, శ్రీవాత్సవ, ఆలయ సిబ్బంది, పూజారులు పాల్గొన్నారు.

ఎవరికీ పట్టని సమావేశాలు!

కొత్తూరు: గ్రామాల్లో నెలకొన్న సమస్యలు.. వాటి పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలు.. నిధులు ఇతర అంశాలపై ప్రతీ మూడు నెలలకోమారు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా గ్రామాల అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయా పథకాలపై సభలో చర్చ జరుగుతోంది. ఇక్కడ చర్చించిన అంశాలను అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేయాలి. ఇంతటి ప్రాధాన్యత ఉన్న సభలకు అధికారులు తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

అధికారుల గైర్హాజరు..

వాస్తవంగా మండల సర్వసభ్య సమావేశం ఎజెండాలో 29 అంశాలు ఉన్నాయి. ప్రతి శాఖకు సంబంధించిన ప్రగతి నివేదికను ఆ శాఖ మండలస్థాయి అధికారులు సభలో చదివి వినిపించాలి. అంతేకాకుండా సభలో ప్రజల పక్షాన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అడిగే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంటుంది. మండలంలో నిర్వహిస్తున్న సమావేశానికి కాలుష్య నియంత్రణ, పరిశ్రమల శాఖ, ఆర్టీసీ, ఎక్సైజ్ పోలీసులు, అటవీశాఖ, హెచ్ఎండీఏ శాఖల అధికారులు వరుసగా గైర్హాజరవుతున్నారు.

సమాచారం ఇచ్చినా..

సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఎంపీడీఓ కార్యాలయాలు ముందుగానే సమాచారాన్ని చేరవేస్తున్నాయి. అయితేకొన్ని శాఖల అధికారులు మొక్కుబడిగా హాజరవుతున్నారే తప్పా పూర్తి సమాచారాన్ని మాత్రం తేవడం లేదు. మరికొన్ని శాఖల అధికారులు సమాచారం అందినా హాజరుకావడం లేదు. మరికొందరు ఒక సమావేశానికి వస్తూ వరుసగా రెండు సమావేశాలకు హాజరుకావడం లేదు.

నిలువ నీడ కరువు

- కడ్తాల్‌లో బస్టాండ్ లేక ప్రయాణికుల అవస్థలు
- రోడ్డుపైనే ఆర్టీసీ బస్సులను నిలుపుతున్న వైనం
- ఇబ్బంది పడుతున్న ప్యాసింజర్స్
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు


కడ్తాల్ ప్రధాన రోడ్డుపైనే ప్రయాణికులను ఎక్కించుకుంటున్న ఆర్టీసీ బస్సు

కడ్తాల్: మండల కేంద్రంలో బస్టాండ్ ఏర్పాటు కలగానే మిగిలింది. దీనికి తోడు బస్‌షెల్టర్లు ఒకచోట బస్సులు మరోచోట నిలుపుతుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై గతంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిన్న బస్‌షెల్టర్ ఉండేది. అందులో పది నుంచి పదిహేను మంది ప్రయాణికులకు కూర్చునేందుకు వీలుండేది. ఏడేళ్ల క్రితం మండల కేంద్రంలో రోడ్డు వెడల్పు పనులు చేపట్టడంతో ఉన్నది కాస్తా కూల్చివేశారు. దాని స్థానంలో రోడ్డు నిర్మాణ గుత్తేదారులు బస్సులు నిలపని చోట్ల రెండు బస్‌షెల్టర్లు నిర్మించారు. దీంతో అవి పనికి రాకుండా పోతున్నాయి. వాణిజ్య, వ్యాపారపరంగా ఎంతో అభివృద్ధి చెందుతున్నప్పటికీ కడ్తాల్‌లో శాశ్వత బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు షెల్టర్ల వద్ద బస్సు నిలుపుతారేమోనని అక్కడ నిలబడితే.. బస్సులు మరో చోట నిలబెడుతుండటంతో వారికి ఉరుకుల పరుగుల కష్టాలు తప్పడం లేదు.

నిలిపేది ఒక చోట....షెల్టర్‌లు మరోచోట

గతంలో రోడ్డు విస్తరణ చేపట్టక ముందు, కనీసం బస్సుల కోసం వేచి ఉండటానికి ప్రధాన రహదారిపై చెట్లైనా ఉండేవి. రోడ్డు విస్తరణ పనులతో గ్రామంలో నిలువ నీడ కరువై ఎండకు, వానకు, దుమ్ముకు ధూళికి బస్సుల కోసం నిలబడాల్సిన దుస్థితి నెలకొంది. ప్రధాన రహదారిపై రోడ్డు విస్తరణలో భాగంగా గ్రామంలో రెండు కిలో మీటర్ల మేరకు 4 లేన్ల రహదారిగా విస్తరించారు. విస్తరణలో భాగంగా గతంలో ఉన్న షెల్టర్ కూల్చి, వేరోచోట మరో రెండు షెల్టర్‌లు నిర్మించారు. గతంలో బస్సులు నిలిపే ప్రదేశంలో బస్‌షెల్టర్ ఉండేది. ప్రస్తుతం ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్ వద్ద బస్సులు, నిలుపక పోవడంతో బస్‌షెల్టర్‌లు ఎందుకు పనికి రాకుండా పోతున్నాయి.

నిత్యం ట్రాఫిక్‌జాం..

మండల కేంద్రం మీదుగా నిత్యం వందలాది బస్సులు తిరుగుతుండటంతో రహదారి నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. బస్సులు కూడా బస్‌షెల్టర్ వద్ద నిలపకుండా రోడ్డుపైనే ఆపి ప్రయాణికులను ఎక్కించుకుంటుండటంతో తరుచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఎండైనా, వానైనా బస్సుకోసం రోడ్డుపై నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. రోడ్డు కిరువైపులా ఉన్నా దుకాణ సముదాయల ముందు నిలబడటానికి వెళ్తే ఆయా దుకాణాల యాజమానుల నుంచి తిట్లు, ఛీత్కరాలు ఎదుర్కొంటున్నారు. ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మండల కేంద్రంలో బస్టాండ్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

బస్టాండ్ నిర్మించాలి



మండల కేంద్రంలో బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రం మీదుగా వందలాది బస్సు సర్వీసులు తిరుగుతున్నా కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ప్రయాణికులు అవసరాల దృష్ట్యా వెంటనే మండల కేంద్రంలో శాశ్వత బస్టాండ్ ఏర్పాటు చేయాలి.

– లాయక్ అలీ, కడ్తాల్

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం




మండల కేంద్రంలో బస్టాండ్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే. బస్టాండ్ ఏర్పాటుకు అనువైన స్థలం కోసం ప్రయత్నిస్తున్నాం. సమస్యను స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్తాం. త్వరలోనే బస్టాండ్ ఏర్పాటు చేసి ప్రయాణికుల కష్టాలు తీరుస్తాం.

– శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు, కడ్తాల్

భవన నిర్మాణం పూర్తయ్యేనా?

- అసంపూర్తిగా తహసీల్దార్ నూతన భవనం
- తాత్కాలికంగా జెడ్పీ గెస్ట్‌హౌస్‌లో కొనసాగుతున్న కార్యాలయం
- ఇబ్బందులు పడుతున్న అధికారులు, ప్రజలు


అసంపూర్తిగా ఉన్న తహసీల్దార్ కార్యాలయ భవనం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయం రెండేళ్లు గడిచినా పూర్తిస్థాయి నిర్మాణానికి నోచుకోవడం లేదు. వివరాల్లోకి వెళ్తే.. నిజాం కాలంలో నిర్మించిన పురాతన భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయాన్ని 2022 ఫిబ్రవరిలో కూల్చివేయించి అప్పటి ఐటీ మంత్రి కేటీఆర్ చేతులమీదుగా నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయించారు. ఆరునెలల్లో నిర్మాణం పూర్తిచేస్తామని నాయకులు చెప్పినప్పటికీ ఇప్పటికీ పూర్తికాలేదు. ప్రస్తుతం జెడ్పీ విశ్రాంతి భవనంలో తహసీల్ కార్యాలయం కొనసాగుతోంది. ఎలాంటి సెక్యూరిటీ సదుపాయం లేని భవనంలోని ఇరుకు గదుల్లో అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. భూ రిజిస్ట్రేషన్లతో పాటు వివిధ పనులపై తహసీల్దార్ కార్యాలయానికి నిత్యం వందలాది మంది వస్తుంటారు. సరైన సౌకర్యాలు లేక వారు ఇబ్బందులు పడుతున్నారు. లోపట స్థలం లేకపోవడంతో కక్షిదారులు కార్యాలయ బయట కూర్చోవాల్సిన పరిస్థితి ఉంది.

జాప్యం ఎందుకు..!

నిధులలేమితోనే ఈభవన నిర్మాణ పనుల్లో జాప్యం నెలకొందని సమాచారం. ఆరు నెలల్లో పూర్తి చేస్తామన్న ఈ భవన నిర్మాణం.. ప్రస్తుతం స్లాబ్, గోడల నిర్మాణం వరకు వచ్చి ఆగిపోయింది. ఈ పనులు నిలిచిపోయి సుమారు ఏడాదిన్నర కావొస్తోంది. అయినప్పటికీ అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. ఈ భవన నిర్మాణానికి కేటాయించిన రూ.1.25 కోట్ల డీఎంఎఫ్‌టీ(డిస్ట్రిక్ మినరల్ ఫండ్ ట్రస్ట్) నిధులు స్లాబ్, గోడల నిర్మాణం వరకే సరిపోయినట్లు తెలుస్తుంది. అదనపు నిధులు మంజూరుకాకపోవడంతో కాంట్రాక్టర్ ఈ పనులు చేయకుండా నిలిపివేశాడు. మరో కోటి రూపాయలకుపైగా నిధులు కేటాయిస్తే పనులు ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ఎమ్మెల్యే దృష్టిసారించాలి...

అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేపట్టిన ఈ భవన నిర్మాణం కాంగ్రెస్ హయంలోనైన పూర్తి అవుతుందా అనే సందేహం కలుగకమానడంలేదు. కొత్త ప్రభుత్వం కొలువుదీరి నాలుగు నెలలు కావస్తున్నా.. తహసీల్దార్ భవన నిర్మాణానికి నిధుల కేటాయింపు ఊసేఎత్తడంలేదు. ఈ నియోజకవర్గానికి కొత్తగా వచ్చిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఈ భవన నిర్మాణంపై దృష్టి కేంద్రీకరించాలని తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు. జెడ్పీ గెస్ట్ హౌస్ భవనాన్ని తహసీల్దార్ కార్యాలయానికి ఉపయోగిస్తుండటంతో.. ఇక్కడికోచ్చే ప్రజాప్రతినిధులు, అధికారులు ఉండేందుకు వసతి లేని పరిస్థితి.

అదనపు నిధులొస్తేనే..

అదనపు నిధులు మంజూరైతేనే తహసీల్దార్ నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభం అవుతాయని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు అంటున్నారు. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక అందజేసామని వారు తెలిపారు. నిధులు ఎప్పుడొస్తాయో, పనులు తిరిగి ఎప్పుడు ప్రారంభం అవుతాయో తెలియని పరిస్థితి ఉంది.